రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

- ఇన్‌చార్జీలకు బియ్యం పంపిణీ పగ్గాలు
- వంతుల వారీగా దుకాణాలను తెరుస్తున్న వైనం
- రెండు రోజులు దాటితే లబ్ధిదారులకు బియ్యం అందని పరిస్థితి
- దుకాణాల చుట్టూ చక్కర్లు కొడుతున్న లబ్ధిదారులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశంతో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. కరోనా కాలం నుంచి రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తున్నారు. కాగా మండలంలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీలో కూడా డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తుండడంతో లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందడం లేదు. లబ్ధిదారుడు తన బియ్యాన్ని రేషన్ దుకాణాల్లోనైనా తీసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. కేటాయించిన రేషన్ దుకాణంలోనే కాకుండా ఎక్కడైనా బియ్యం తీసుకోవచ్చనే నిబంధనలు పెట్టడంతో కొంత మేరకు బాగానే ఉన్నా పంపిణీ సక్రమంగా జరగడం లేదు. దీంతో మండలంలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలో ఉన్న నాలుగు దుకాణాల్లో రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం లేదు. ఒక దుకాణంలో మాత్రమే బియ్యం పంపిణీ ప్రారంభించడంతో లబ్ధిదారులు ఒకేసారి మూకుమ్మడిగా వస్తుండడంతో బియ్యం దొరకని పరిస్థితి ఎదురవుతోంది. దుకాణంలో ఉన్న రేషన్ బియ్యాన్ని పూర్తి చేసి ఇక్కడ బియ్యం అయిపోయాయి. మరో దుకాణంలో తీసుకోండని లబ్ధిదారులను డీలర్లు తిప్పుతున్నారు. మరో దుకాణానికి వెళ్తే అక్కడ దుకాణం తెరిచి ఉండడం లేదని వారు పేర్కొంటున్నారు. బియ్యాన్ని వంతుల వారిగా పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇన్‌చార్జీలే దిక్కు..

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికి బినామీ డీలర్లే కాకుండా, ఇన్‌చార్జీలతో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వారు పంపిణీని ఇష్టం వచ్చినట్లు చేస్తుండడంతో సకాలంలో బియ్యం పంపిణీ జరగడం లేదు. సమయ పాలన పాటించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. బియ్యం వచ్చిన ప్రతినెలా ఇదే గోసపడుతున్నామని వారు చెబుతున్నారు. బియ్యం ఎక్కడ ఉంటాయో...ఎక్కడ ఉండవో...తెలియని పరిస్థితి ఉందంటున్నారు. బియ్యం పంపిణీ ప్రారంభం నుంచి రెండు రోజులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. మాకు బియ్యం రాలేదని దుకాణాల చుట్టూ లబ్ధిదారులు చక్కర్లు కొడుతున్నా ప్రయోజనం లేకుండా పోతుందని పేర్కొన్నారు.

ప్రతి లబ్ధిదారుడికి ఇవ్వాల్సిందే

రేషన్ పరిధిలో ఉన్న లబ్ధిదారులందరికి తప్పనిసరిగా రేషన్ బియ్యం ఇవ్వాల్సిందే. పది రోజుల వరకు పంపిణీ కార్యక్రమం జరగాలి. బియ్యం పంపిణీ చేయకుండా దుకాణాలను మూసి ఉంచినట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
–హిమబిందు, తహసీల్దార్, సదాశివనగర్

ఉపాధి కోల్పోయాం.. ఆదుకోండి



జుక్కల్ తహసీల్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు



రామారెడ్డి: రెడ్డిపేటలో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

ఉపాధి కోల్పోయాం..ఆదుకోండని బుధవారం దోమకొండ, జుక్కల్, రామారెడ్డి మండలాల్లో ఆటో డ్రై వర్‌లు ధర్నాలు నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలందరూ ఆర్టీసీ బస్సుల్లోనే వెళుతున్నారని వారు పేర్కొన్నారు. దీంతో ఆటోలు నడవక తాము ఉపాధి కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు నినాదాలు చేశారు. అనంతరం వారు స్థానిక తహసీల్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



దోమకొండలో ఆటోలు నిలిపి ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్‌లు

క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



కామారెడ్డి : భిక్కనూర్ మండలానికి చెందిన సిద్ధిరాములు అగస్టు 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కామారెడ్డి పోస్టల్ శాఖ అధికారులు బుధవారం మృతుడి బంధువుకు పోస్టల్ ప్రమాద బీమా చెక్కు రూ.10 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎస్ఎస్‌పీ హన్మంత్, ఏఎస్‌పీ భూమన్న, కామారెడ్డి మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, పోస్ట్ మాస్టర్ రాజు తదితరులున్నారు.

నర్సరీ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లెబోగుడతండా, బొల్లారం, జప్తిజాన్కంపల్లి, మెల్లకుంటతండాలో చేపట్టిన నర్సరీ పనులను బుధవారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. నర్సరీలలో త్వరగా సీడ్ డిబ్లింగ్ చేయించాలని నర్సరీ నిర్వాహకులను ఆయన ఆదేశించారు. దీంతో పాటు ప్రతిరోజు నీటిని పట్టాలన్నారు. మట్టి నింపిన బ్యాగుల్లో పెరిగిన గడ్డిని తొలగించాలన్నారు. కార్యదర్శులు సునంద, సంతోష్, ప్రదీప్, సవాయి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



కామారెడ్డి టౌన్: సిద్దిపేటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ యోగా అండర్–14 విభాగంలో ప్రతిభ చాటిన పాల్వంచ మండలం ఆరేపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే తన నివాసంతో అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 9 మంది విద్యార్థులను సన్మానించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



భిక్కనూరు: పెద్ద మల్లారెడ్డిలో కొన్ని చోట్ల మురికికాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురికికాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కంపుకొడుతున్నా ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పారిశుధ్య పనులను చేపట్టాలని వారు కోరుతున్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం నాటికి 69 వేల 52 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరుకు తరలించాలని వేడుకోలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఆరుగాలం శ్రమించి పండించిన చెరుకును ఫ్యాక్టరీ అధికారులు తరలించడం లేదని మండల కేంద్రానికి చెందిన కొప్పుల స్వజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్‌కు వినతి పత్రం అందజేశారు. చుట్టుపక్కల వరి పంట సాగు చేయడం వల్ల చెరుకును ఫ్యాక్టరీకి తరలించడానికి దారి ఉండదని, చుట్టుపక్కల రైతులు పంటలు వేయకముందే తన చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. తన చెరుకును తరలించకుండా సంబంధిత ఫీల్డ్‌మెన్, ఫ్యాక్టరీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే తన చెరుకును ఫ్యాక్టరీకి తరలించాలని కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాచారెడ్డి: గ్రామాల్లో ఆటోలు, ట్రక్కులలో సంచరిస్తూ విక్రయించే ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ బుధవారం సూచించారు. లైసెన్స్ ఉన్న ఏజెన్సీలలోనే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు తర్వాత రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

భిక్కనూరు: హైదరాబాద్ నగరం ఉప్పల్‌లోని అమ్మ–నాన్న అనాథ శరణాలయానికి రూ.20 వేల విలువచేసే నిత్యావసర వస్తువులను బుధవారం భిక్కనూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళి అందజేశారు. అమ్మ–నాన్న ఆశ్రమ నిర్వాహకులు, నాయకుడు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి

మద్నూర్(జుక్కల్): రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఏవో రాజు పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలో సాగులో ఉన్న మినుము, శనగ, కంది పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినుములో పొగాకు లద్దె పురుగు గమనించామని అన్నారు. ఈ పురుగు పగలు మట్టి పెళ్లల్లో ఉండి రాత్రి వేళలో పంటను ఆశించి నష్టపరుస్తుందన్నారు. దీని నివారణకు నోవలూరాన్ 10 మందును లేదా తయోడికార్బ్ 75 మందును ఒక గ్రాము తీసుకొని లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఏఈవో గజానన్ ఉన్నారు.

నర్సరీల పరిశీలన

బాన్సువాడ: బీర్కూర్ మండలంలోని బీర్కూర్, తిమ్మాపూర్‌లో ఉన్న నర్సరీలను బుధవారం జిల్లా అదనపు సంచాలకులు రామ్‌నారాయణ పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా చేపడుతున్న నర్సరీలు, వేంకటేశ్వర గుట్టపై చేస్తున్న కందకాల పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో భానుప్రకాష్, ఏపీవో అక్మల్, తదితరులు ఉన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం ఉత్తునూర్‌లోని రైతు వేదిక భవనంలో పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. రైతులు భూసార పరీక్షల ద్వారా అందించిన ఫలితాల ప్రకారం ఎరువులు వేసుకోవాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ రాజు, ఉద్యానవన శాఖాధికారి లోకేష్, ఏఈవో శిరీష, సర్పంచ్ మోతె సాయవ్వ, ఉప సర్పంచ్ శివ పాటిల్, ఎంపీటీసీ రాంచందర్ రావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రాజంపేట: మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ఎంపీవో రఘురాం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగేలా చూడాలని తెలిపారు. చెత్తను ప్రతిరోజు ట్రాక్టర్ ద్వారా తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో భాస్కర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మానవ రవాణాను అడ్డుకోవాలి



మాచారెడ్డి: మానవ రవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలను అడ్డుకోవాలని కామారెడ్డి సాధన ట్రస్ట్ రిసోర్స్ పర్సన్ రవి సూచించారు. బుధవారం లచ్చాపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఆడపిల్లలు పోకిరీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు సులోచన, శ్రీనివాస్, పేరి నాయుడు, శరత్, బాల్‌రాజు ఉన్నారు.

మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ నేతలు



కొబ్బరికాయలు కొడుతున్న నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్‌రావు గెలుపొందితే నల్లపోచమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొడతానని నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి ఎన్నికలకు ముందు మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బుధవారం మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి నాయకులతో కలిసి నల్లపోచమ్మ ఆలయంలో మొక్కు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కిషన్‌రెడ్డి, సుధాకర్, ఇమామ్, లక్ష్మణ్, షాహెద్‌పాష, నర్సింహారెడ్డి, సాయికుమార్, శేఖర్, గులాం, ఆంజనేయులు, ఫారూఖ్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

దోమకొండ: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో జరిగిన ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5లక్షలు నిధులు అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలన్నారు. మణికంఠ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కదిరె మోహన్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలతో వ్యాయామం చేయించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామం చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు. పిల్లలతో వ్యాయమాలు చేయించారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్ఎం విఠల్ పాల్గొన్నారు.

కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న గ్రామ యువకులు

రాజంపేట: మండల కేంద్రంలోని సర్వే నెంబరు–575, 569, 576 ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంపిణీ చేయాలని గ్రామ యువకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజంపేట మండల కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. గ్రామంలోని కొంత మంది బడానాయకులు అసైన్డ భూములను పదుల సంఖ్యలో కబ్జా చేశారని, కొంత మంది ఏకంగ ఒకే కుటుంబం పేరిట 10–20 ఎకరాల భూమిని కబ్జా చేసి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. భూకబ్జాలపై ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అవసరమైతే నిరాహార దీక్ష సైతం చేపడతామని హెచ్చరించారు. కొప్పుల నరేష్, ఇంతియాజ్ అలీ, కందారం కాశీరాం, బాబు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి శిబిరం రద్దు

బాన్సువాడ రూరల్: మండలం కేంద్రంలోని భవిత సెంటర్‌లో ప్రతి వారం శారీరక, మానసిక వికలాంగులకు నిర్వహించే ఫిజియోథెరపి శిబిరం గురువారం నిర్వహించడం లేదని ఐఆర్‌టీ పద్మ తెలిపారు. ఫిజియోథెరపిస్టు అందుబాటులో లేకపోవడంతో శిబిరం రద్దు చేశామన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని సీఐటీయూ నాయకులు రాజనర్సు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్–4 ప్రకారం నెలకు రూ.16,600 వేతనం చెల్లించాలని అన్నారు. మున్సిపల్ కార్మికులు దుర్గయ్య, వేణు, పోచయ్య తదితరులున్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేయాలి



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం గురువారం ఉదయం కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా కోరారు. బుధవారం ఆయన రక్తదాన శిబిరం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మెగా రక్తదాన శిబిరానికి యువకులు ముందుకు రావాలని కోరారు. కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్ ఉన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి



వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ సంజీవ్



ఆజామాబాద్‌లో పిల్లలను గుర్తించిన సీఆర్‌పీలు

మాచారెడ్డి: బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్‌పీ దేవ సంజీవ్ అన్నారు. బుధవారం గజ్యా నాయక్ తండాకు చెందిన నవనీత అనే 13 ఏళ్ల బాలికను గుర్తించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి వచ్చే నెల 10 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హెచ్ఎం రాజేశ్వరిదేవి ఉన్నారు.

ఆజామాబాద్‌లో ..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఆజామాబాద్‌లో బడి బయట పిల్లలను గుర్తించినట్లు సీఆర్‌పీ మహిపాల్ తెలిపారు. బడికి రాకుండా ఉన్న ముగ్గురు పిల్లలను గుర్తించి వారిని సమీపంలోని పాఠశాలలో చేర్పించినట్లు ఆయన తెలిపారు.

బస్సు కోసం విద్యార్థుల నిరీక్షణ



నిరీక్షిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థినులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో స్కూల్ విద్యార్థులు బుధవారం సాయంత్రం బస్సు కోసం గంటల తరబడి నిరీక్షించారు. బుధవారం సాయంత్రం స్కూల్ సమయం ముగిసిన తర్వాత విద్యార్థులు బస్సు కోసం పోలీస్‌స్టేషన సమీపంలోని మోడల్ స్కూల్ రిక్వెస్ట్ స్టాప్ వద్దకు వచ్చారు. ప్రతిరోజు 5.30గంటలకు రావాల్సిన బస్సు 7 గంటలైనా రాలేదు. విద్యార్థులు చీకటి పడుతున్నా ఇళ్లకు చేరకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు 7 గంటల తర్వాత బస్సు రావడంతో విద్యార్థులు వారి వారి గ్రామాలకు బయల్దేరారు.

కళాశాల భూముల జోలికి వస్తే ఊరుకోం



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు, ఆస్తుల జోలికి వస్తే ఊరుకోబోమని, అధికారులు ఆ భూములను పరిరక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ కళాశాల భూములు కబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం తప్పుడు లీజు రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతుందని ఆరోపించారు. తక్షణమే ఆ నిర్మాణ పనులను నిలిపివేయాలని హెచ్చరించారు. డిగ్రీ కళాశాల ఆటస్థలాన్ని ధరణి రికార్డులో ప్రొహిబిటెడ్ లిస్టులో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎప్పటికైనా ఈ భూమి కళాశాలదేనని స్పష్టం చేశారు. యూకో బ్యాంకులో అరోరా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 26.15 ఎకరాల భూమి మీద తీసుకున్న రుణం తక్షణమే కళాశాల యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల జోలికి ఎవరు వచ్చినా వారి ఇంటి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎస్. ఆజాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు



నస్రుల్లాబాద్‌లో నాణ్యత లేకుండా నిర్మించిన రోడ్డు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో నిర్మించిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లేకపోవడంతో మూడ్నాళ్లకే బీటలు ఏర్పడ్డాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పోచమ్మ గల్లీకి వెళ్తున్న రోడ్డును నిర్మించి మూడేళ్లు పూర్తి అవ్వక ముందే పగుళ్లు ఏర్పడ్డాయి. నాసిరకంగా నిర్మించడంతో కొన్నాళ్లకే వచ్చాయి. పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు వెంట ఉండి పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

బాన్సువాడ రూరల్: మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31లోపు ఉపాధిహామీ పథకం నిధుల చెల్లింపునకు సంబంధించి చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించనున్నారు. ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహిస్తామని, మండల సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధిహామీ కూలీలు హాజరై జయప్రదం చేయాలని ఏపీవో మల్లేశ్ కోరారు.

15న అయ్యప్ప మహాపడి పూజ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఈ నెల 15న అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించనున్నట్లు గురుస్వామి రవిగౌడ్ తెలిపారు. పడిపూజకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు కామారెడ్డిలో కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

కామారెడ్డిటౌన్/భిక్కనూరు: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్స్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్‌పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావులు పాల్గొంటారన్నారు. నేతలు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899